విద్యార్థులకు శుద్ధజలం


పొన్నారి పాఠశాలలో మినరల్ వాటర్ తాగుతున్న విద్యార్థులు

- దాతలు, గ్రామపెద్దల సహకారం
- పలు పాఠశాలల్లో వాటర్‌ప్లాంట్స్ ఏర్పాటు
- చేయూతనిస్తున్న స్థానికులు

తాంసి: ప్రస్తుతం కలుషితమైన నీరే అన్ని రోగాలకు కారణం అవుతుంది. అపరిశుభ్రంగా ఉన్న నీటిని తాగడం వలన వివిధ రకాల వ్యాధులు సోకి అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారంతో పాటు పరిశుభ్రమైన తాగునీరు కూడా అవసరం. శుభ్రమైన నీరు నిత్యం తాగకపోవడం వలన డయేరియాతో పాటు విరేచనాలు బారిన పడే అవకాశం ఉంది. ముఖ్యంగా పాఠశాలలో విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందుబాటులో లేకుండా అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. దీంతో పలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు దాతలు ముందుకు వచ్చి చేయూతనందిస్తున్నారు.

విద్యార్థులకు శుభ్రమైన తాగునీరు..

తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా పాఠశాలలో పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, రిటైర్డ్ ఉపాధ్యాయులు తమ పాఠశాలలకు తమవంతు చేయూతగా విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే వారిలో ఎక్కువగా పేద, మధ్య తరగతి వర్గానికి చెందిన విద్యార్థులే ఉంటారు. ఆయా పాఠశాలలో చేతిపంపులు ఉన్నా సరైన నీరు లేక తాగడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్థానికులు స్వయంగా ముందుకువచ్చి తాగునీటిని అందేలా చేయూతనివ్వడంతో ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులకు శుభ్రమైన తాగునీరు అందుతుంది.


అర్లి(టి) పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్

దాతల చేయూత..

- భీంపూర్ మండలంలోని అర్లి(టి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల పాఠశాలలో పనిచేసి పదవీ విరమణ పొందిన హెచ్‌ఎం శ్రీధర్ రెడ్డి రూ.1లక్ష రూపాయలతో ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీంతో చల్లని తాగునీరు అందేలా ఫ్రిడ్జ్‌ను సైతం ఏర్పాటు చేశారు.
- భీంపూర్ మండలంలోని ధనోర పాఠశాలలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తలకొంత డబ్బులు పోగుచేసి మంచినీటిని అందిస్తున్నారు. గ్రామంలోని వాటర్‌ప్లాంట్ నుంచి నిత్యం నీటిని క్యాన్‌ల ద్వారా సరఫరా చేస్తూ తాగునీటిని విద్యార్థులకు అందేలా చూస్తున్నారు.
- కరంజి(టి) పాఠశాలలో విద్యార్థులకు గ్రామాభివృద్ధి కమిటీ తరఫున శుభ్రమైన నీటిని సరఫరా చేస్తున్నారు. నిత్యం ఆటో ద్వారా గ్రామంలోని పాఠశాలకు నీటి క్యాన్లకు పంపుతున్నారు.
- తాంసి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, దాతలు తలకొంత డబ్బులు పోగు చేశారు.పో గు చేసిన డబ్బులతో నీటిని అందేలా చూస్తున్నారు.
- పొన్నారి ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన నవీన్‌రెడ్డి అనే వ్యక్తి ముందు కొచ్చాడు. తనవంతుగా నిత్యం పాఠశాల విద్యార్థులకు శుద్ధమైన జలయం కోసం రూ.10 వేలు ఖర్చు చేసి నీటిని అందిస్తున్నాడు.
- కొన్ని పాఠశాలల్లో దాతలు సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ యంత్రాలు గతంలో ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ సరిగ్గా లేక పని చేయడం లేదు. వాటికి మరమ్మతులు చేయిస్తున్నారు.

వాటర్‌ప్లాంట్ విరాళం



పాఠశాల విద్యార్థులు శుభ్రమైన తాగునీరు తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారు. శుద్ధజలం అందించేందుకు వాటర్ ప్లాంట్ విరాళంగా అందించాను. పాఠశాలలో సరైన తాగునీటి వసతి లేక విద్యార్థులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. ఇప్పుడు శుద్ధమైన నీరు ఉండటంతో విద్యార్థులకు మేలు జరుగుతుంది.

– శ్రీధర్ రెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం (అర్లి(టి) ఉన్నత పాఠశాల)

క్లుప్తంగా

సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో కమ్యూనికేషన్ స్కిల్స్ అనే అంశంపై 30 రోజుల నూతన సర్టిఫికెట్ కోర్సును ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రఘు గణపతి ప్రారంభించారు. ప్రస్తుత తరుణంలో ఆంగ్ల భాషలో కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆంగ్లభాష కోర్స్ కోఆర్డినేటర్ అనిత మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై భాషపై పట్టు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆంగ్ల అధ్యాపకులు సంతోషిని, భువనేశ్వరి, గోపాల్, నరేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఇసుక వేలం

ఆదిలాబాద్‌టౌన్: భోరజ్ మండలంలోని డోలార, పెండల్వాడ శివారులో ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. 300 క్యూబిక్ మీటర్ల ఇసుకతో పాటు 3 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లుగా తెలిపారు. ఇసుక డంపులకు ఈనెల 24న ఉదయం 11గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాజేశ్వరీ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు. విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వీటీజీ సెట్‌కు ఏర్పాట్లు

ఇచ్చోడ: వీటీజీ సెట్ కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు గిరిజన గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపల్ గోవర్ధన్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో నిర్వహించే వీటీజీ సెట్ పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 480 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందన్నారు.

'అంజిరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి'

ఇంద్రవెల్లి: కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నిరంతరం ప్రజల తరుపున నిలబడే ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనక తుకారం, దిలీప్ మోరే, ముండే సాయినందన్, మస్కే రాజువర్ధన్, సిందే దత్తు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నార్నూర్: దివ్యశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని హీరానాయక్ మైదానంలో క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఫౌండేషన్ చైర్మన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు క్రీడా పోటీలు నిర్వహించేందుకు దివ్యశ్రీ ఫౌండేషన్ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాథోడ్ ఉత్తమ్, రాథోడ్ దత్తారం, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో బాధితుడిని పరామర్శించిన డీఎఫ్‌వో

ఆదిలాబాద్‌టౌన్: ఎలుగుబంటి దాడిలో గాయపడి రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మావల మండలంలోని వాఘాపూర్ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనుడిని డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ పరామర్శించారు. అటవీశాఖ సిబ్బందితో కలిసి రిమ్స్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి అటవీశాఖ తరపున రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. అటవీశాఖ తరపున దర్యాప్తు చేసి ఆర్థికసాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. డీఎఫ్‌వో వెంట అధికారులు ప్రశాంత్, ఇమ్రాన్‌ఖాన్ ఉన్నారు.

కొనసాగుతున్న సప్తాహం

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి)లో సప్తాహం కొనసాగుతోంది. శనివారం గణేష్ మహరాజ్ కొల్హరికర్ ఆధ్యాత్మికత ప్రవచనలు చేశారు. సప్తాహం ముగింపు సందర్భంగా ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బ్రహ్మనిష్ఠ వైష్ణవ సదన్ పీఠాధిపతి నానాయణ్ మహరాజ్ ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి టి.ప్రణీత అన్నారు. పట్టణంలోని రణదీవేనగర్ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పుస్తక మిత్ర ఎన్జీవో రూ. 34 వేల విలువైన పుస్తకాలను అందించారు. దీంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని శనివారం డీఈవో ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు బి.లక్ష్మణ్, ఉపాధ్యాయులు శ్రీహరిబాబు, ప్రసాద్, మంజుల, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

యువతలో నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యం

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ నాలెడ్జ్ (టాస్క్) శిక్షణతో యువతలో నైపుణ్యాలు పెంపొందించి ఉద్యోగ సాధనకు మార్గాన్ని సులువు చేయడమే లక్ష్యంగా టాస్క్ ముందుకు సాగుతుందని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాణి అన్నారు. ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో 21 సెంచరీ ట్రాన్ఫారబుల్ స్కిల్స్ అంశంపై మూడు రోజుల పాట నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. తరగతులకు కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టాస్క్ నుంచి కార్పొరేట్ ట్రైనర్ రమా మనోజ్ హాజరై నాయకత్వ లక్షణాలు, ద్రవ్య నిర్వహణ, టీం వర్క్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో టాస్క్ కో ఆర్డినేటర్ షేక్ ముజీబ్, అధ్యాపకులు సయ్యద్ జావెద్ అలీ, నసీర్, దేవన్న, నవీన్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న టాస్క్ అధికారులు

ఉన్నత లక్ష్యంతో చదవాలి


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నార్నూర్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని ఎంపీడీవో జవహర్ లాల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రశాంత్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు వారి నైపుణ్యాన్ని బట్టి వివిధ రంగాల్లో రాణించాలన్నారు. ఇష్టంతో కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థుల సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

అలరించిన 'వీడ్కోలు'

బోథ్: మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో శనివారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యం, పాటిన పాటలు, నాటికలు అలరించాయి. విద్యార్థులు ఉన్నత లక్ష్యం పెట్టుకొని చదవాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. కార్యక్రమంలో ఏపీవో జగ్దేరావ్, పాఠశాల ప్రత్యేకాధికారిణి వలిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

నేరడిగొండ: విద్యార్థులు కష్టపడి చదవి జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని బుగ్గారం టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలికల పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి అన్నారు. శనివారం పాఠశాలలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి రాణించాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులు డీజే పాటలపై నృత్యం చేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ గోవర్ధన్, రోజారాణి, తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పాఠశాలలో మాక్ అసెంబ్లీ


మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులు

తలమడుగు: మండలంలోని సుంకిడి ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. శాసనసభ సభాపతిగా, ఎమ్మెల్యేలుగా విద్యార్థులు వ్యవహరించారు. సభలో మూడు బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ స్వామి మాట్లాడుతూ విద్యార్థులు అసెంబ్లీలో జరిగే సన్నివేశాలను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించడం జరిగిందన్నారు. ఇలాగే అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని కోరారు. కార్యక్రమంలో వై. రాం రెడ్డి, సుకుమార్ పెట్కులే, సుజాత, శ్రీనివాస రెడ్డి, సంజీవరెడ్డి, ప్రధానోపాధ్యాయులు వాణి మేడం, సత్యనారాయణ, మహేందర్, నరేశ్ పాల్గొన్నారు.

'గెలుపే లక్ష్యంగా పనిచేయాలి'


మాట్లాడుతున్న ఆడే గజేందర్

నేరడిగొండ: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటర్లను కలిసి ఎన్నికల ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పోతారెడ్డి, మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పరామర్శ

ఆదిలాబాద్‌టౌన్: గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షులు బొంపెల్లి భూమన్న హఠాన్మరణం ఆవేదనకు గురి చేసిందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం పట్టణంలోని వాల్మీకినగర్‌లో గల ఆయన నివాసానికి చేరుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

బజార్‌హత్నూర్: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో కిషన్ గుప్తా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఖల్సా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సర్దార్ ధర్మేంద్రసింగ్ జ్ఞాపకార్థం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. పిప్రి, దేగామ, భూతాయి గ్రామాల్లోని పాఠశాలల్లో కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భూమన్న, రాంకిషన్, సేవసింగ్, సోహన్‌సింగ్, సుదీర్, రమేశ్, లింగన్న, మనోహర్, మంగులాల్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బేల: మండలంలోని కాంఘర్‌పూర్ రెవెన్యూ గ్రామ శివారులోని పెన్‌గంగ నుంచి శనివారం సాయంత్రం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై దివ్యభారతి, ఏఎస్సై కనక జీవన్‌కుమార్‌లు పేర్కొన్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి, తదుపరి చర్యలకు జిల్లా మైనింగ్ అధికారికి నివేదించినట్లు తెలిపారు.

ఘనంగా వరల్డ్ థింకింగ్ డే వేడుకలు

ఆదిలాబాద్‌టౌన్: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆదిలాబాద్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఆ సంస్థ కార్యాలయంలో ప్రపంచ సమాలోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఈవో ప్రణీత ముఖ్య అతిథిగా హాజరై స్కౌట్స్ అండ్ గైడ్స్ జెండా ఆవిష్కరించారు. బేడెన్ పావెల్ దంపతుల చిత్రపటాల వద్ద కొవ్వొత్తి వెలిగించి నివాళులర్పించారు.

నాటిన ప్రతిమొక్కనూ కాపాడాలి


మొక్కలు నాటుతున్న ఎఫ్‌ఆర్‌వో గణేశ్

నేరడిగొండ: నాటిన ప్రతిమొక్కనూ కాపాడాలని నేరడిగొండ ఎఫ్‌ఆర్‌వో గణేశ్ అన్నారు. శనివారం మండలంలోని బుగ్గారం(బి) గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా 400 మొక్కలు నాటారు. ఎవెన్యూ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటడం జరిగిందన్నారు. నాటిన మొక్కలను అటవీశాఖ అధికారులే కాకుండా ప్రజలు సైతం కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి రాథోడ్ సవిత, ఎఫ్‌బీవో భీంజీ, తదితరులు పాల్గొన్నారు.

హీరాసుక జయంతి విజయవంతం చేయండి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఆదివారం నిర్వహించనున్న గోండి ధర్మ గురు హీరాసుక జయంతిని విజయవంతం చేయాలని హీరాసుక ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మెస్రం శంకర్, గౌరవ అధ్యక్షుడు ఉయిక సుదర్శన్‌లు పిలుపునిచ్చారు. శనివారం సభ ఏర్పాట్లను కుల పెద్దలతో కలిసి పరిశీలించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సమస్త ఆదివాసీ పర్ధాన్ సమాజం మేధావులు, ఉద్యోగులు, యువకులు, కార్మికులు, కర్షకులు, వివిధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పూసం ఆనంద్‌రావ్, ఆత్రం అనుసూయ, గేడం భారతిబాయి, సెడ్మకి సుభాష్, వెట్టి దేవిదాస్, గేడం మాధవ్, మడావి దిగంబర్, ఆర్క శేషరావ్, కుడ్మేత ప్రకాష్, విఠల్, గణేష్, వెట్టి మనోజ్, పెందూర్ భూమన్న, పెందూర్ దిలీప్, కినక సత్య పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


క్రీడాకారులతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం బోథ్ మండలంలోని పట్నాపూర్ చైతన్య యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. గత 30 సంవత్సరాల నుంచి పట్నాపూర్ గ్రామంలో వాలీబాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువతకు అన్నివిధాలుగా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ స్వామి, శ్రీధర్ రెడ్డి, సుగుణ శంకర్ పాల్గొన్నారు

కేసీఆర్ వల్లే సేవాలాల్ జయంతి ఉత్సవాలు

సోనాల మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన 286వ శ్రీసంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ముందుగా బంజారా సాంప్రదాయ ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి , భోగ్ సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రంగా సోనాల ఏర్పడిన తర్వాత మొదటిసారి సేవాలాల్ జయంతి ఉత్సవాలు జరగడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో రాష్ట్రంలో సేవాలాల్ జయంతి ఉత్సవాలు జరుపుకుంటున్నామన్నారు.

కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానం

సోనాల మండలంలోని శివాలయంలో ఈనెల 24న నిర్వహించే శివపార్వతుల కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఆహ్వానించారు. కార్యక్రమంలో రాథోడ్ సజన్, స్వామి, శివారెడ్డి, నానాక్ సింగ్, సుధీర్ రెడ్డి, అభిలాష్, నరేందర్, ఆసిఫ్, భీంరావ్ పాటిల్, చిన్నయ్య పాల్గొన్నారు.

టీకాలు ఇవ్వడంలో అలసత్వం చేయొద్దు


రికార్డులు పరిశీలిస్తున్న శ్రీనివాస్

ఇచ్చోడ: వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వడంలో అలసత్వం చేసే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది పర్యటించి గర్భవతులకు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు అందచేసే విషయంలో వైద్యాధికారులు సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలన్నారు. ఆయన వెంట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బ్రహ్మానందం రెడ్డి, వైద్యాధికారులు హిమబిందు, సచిన్, సిబ్బంది రాథోడ్ కృష్ణ, మంజుల, జీవిత ఉన్నారు.

సావిడి వ్యవస్థ బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న గోవింద్‌రావు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలో సావిడి వ్యవస్థను బలోపేతం చేయడానికి ఈనెల 27 నుంచి సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గోవింద్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల పరిధిలో గల పోతగూడలో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకునేందుకు కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో నాయకులు కొడప సోనేరావు, కుమ్రరాజు, టేకం గణేష్, జలపత్‌రావు, కొడప బాపురావు, మడావి భీంరావు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే'


మాట్లాడుతున్న వేణుగోపాలాచారి

నేరడిగొండ: అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రాష్ట్రంలో 55 వేల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనని మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి సత్తు మల్లేశ్‌లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఉట్కూర్ నరేందర్‌ను బోథ్ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీల పేరిట తెలంగాణ ప్రజల డబ్బు దోచుకుంటుందని ఆరోపించారు. కుల, మతాల పేరిట రాజకీయం చేసే వారికి ఓటు వేయవద్దన్నారు. సమావేశంలో ఆడే గజేందర్, ఎన్నికల పరిశీలకులు గాజర్ల అశోక్, పీసీసీ కోఆర్డినేటర్ మార్క విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

బోథ్: మండలంలోని కొత్త గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను పెద్దమ్మ తల్లికి సమర్పించారు. గ్రామంలో బైండ్లోళ్ల విన్యాసాల మధ్య శోభాయాత్ర నిర్వహించారు. మరో రెండు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

బోథ్: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని సోనాల మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్య, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి చిన్నమలైకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోరె రవీందర్, కచ్చకాయల హరీశ్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకశాఖ చైర్మన్‌ను కలిసిన మాజీ జెడ్పీటీసీ

తలమడుగు: రాష్ట్ర పర్యాటక శాఖ చైర్మన్ రమేశ్‌రెడ్డిని శనివారం మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ జిల్లాలో ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని వాటిని గత ప్రభుత్వం పట్టించుకోలేదని, కాంగ్రెస్ హయాంలో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, బాపన్న, వెంకట్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.